


## కొబ్బరికాయల అలంకారంలో గంగమ్మ



తిరుపతి(రవాణ)మే 20(ప్రభాతవార్త:

తిరుపతి నగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మజాతర ముగిసిన తరువాత తొలిమంగళవారంరోజు గంగమ్మ కొబ్బరి కాయల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.జాతర తరువాత తొలి మంగళవారంతో బాటు ఐదు వారాలకు ఎంతో విశిష్టత ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం వేకువజామున 3గంటలకు అమ్మవారికి అర్చకులు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయం గర్భగుడిలోపల, అమ్మవారిని పూర్తిగా దాతలుఇచ్చిన కొబ్బరికాయలతో అలంకరించారు. ఏకధాటిగా భక్తులకు ఉదయంనుండి రాత్రి వరకు దర్శనం కల్పించారు. ఆలయంలో ఈఓ జయకుమార్ స్వయం పర్యవేక్షణలో భక్తులు ప్రశాంతంగా పొంగళ్ళు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

## నేడు కుప్పంకు సిఎం చంద్రబాబు రాక

### - రెండోదఫా అమ్మవారి జాతరకు హాజరు !!



కుప్పం, మే 20 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు బుధవారం కుప్పంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.30గంటలకు ద్రవిడ వర్సిటీకి హెలికాప్టర్‌లో చేరుకుని అక్కడ నుంచి కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారి ఆలయానికి 12.50గంటలకు చేరుకుని 1.30గంటల వరకు కుటు ంబసమేతంగా అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం ద్రవిడ వర్సిటీకి రోడ్డుమార్గంలో బయలుదేరుతారు. మధ్యాహ్నం3గంటలకు ద్రవిడ వర్సిటీనుంచి బెంగళూరుకు హెలికాప్టర్‌లో పయనమవుతారు. కాగా కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ జాతరకు సిఎం చంద్రబాబునాయుడు రెండో దఫా విచ్చేస్తున్నారు. ముఖ్యమంత్రి హోదాలో 2019లో సైతం సిఎం చంద్రబాబునాయుడు అమ్మవారి జాతరకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

### వైభవంగా శ్రీ తిరుపతి గంగమాంబ

## శిరస్సు ఊరేగింపు

### జనసంద్రంలా మారిన కుప్పం ..
### అమ్మవారికి భారీగా జంతుబలులు!!



కుప్పం, మే 20 ప్రభాతవార్త

భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి.. శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ తల్లి.. అందునా అమ్మవారి శిరస్సు ఊరేగింపు.. ఈ వేడుకలు తిలకించేందుకు భక్తజన కోటి అశేషరీతిలో హాజరయ్యారు. జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఈ జాతరను తిలకించేందుకు రెండు కళ్లు చాలవనే రీతిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు. విలువైన ఆభరణాలతో అమ్మవారిని ఈసందర్భంగా అలంకరించారు. ఉదయంనుంచే పాతపేట ప్రాంతం జనసంద్రంగా మారిపోయింది. అమ్మవారి శిరస్సు కళ్లకు తెర తొలగించిన అనంతరం అమ్మవారి శిరస్సు ఊరేగింపు మొదలైంది. ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ స్వయంగా అమ్మవారి ఉత్సవాన్ని మోశారు. గాండ్లవీధి, మునస్వామిపురం, నేతాజీ రోడ్డు,చిత్తరంజన్ రోడ్డు, టిబి రోడ్డు, కొత్తపేట, తపాలరాజు వీధి, ప్యాలస్ రోడ్డు, సోమయ్య వీధి, పైబాట తదితర ప్రాంతాల మీదుగా అమ్మవారి శిరస్సును ఊరేగించారు. అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారికి జంతుబలులు ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ వాసులే కాక వివిధ గ్రామీణ ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాలకు చెందిన వేలాది భక్తులు అమ్మవారికి బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకోవడం కన్పించింది. ఈసందర్భంగా రహదారులన్నీ రక్తసిక్తంగా మారాయి.పలువురు తమ చిన్నారులను అమ్మవారి శిరస్సువద్ద ఉంచి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా పట్టణంలో జనం సందడి అధికంగా కన్పించింది. వేల సంఖ్యలో భక్తులు కుప్పం పట్టణం చేరుకోవడం కన్పించింది. అమ్మవారి ఆలయం, శ్రీ ముత్తుమారెమ్మ ఆలయ విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత గోపీనాథ్,ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, స్థానిక నేతలు, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

**నేడు శ్రీ తిరుపతి గంగమాంబ విశ్వరూప దర్శనం :**

కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమాంబ జాతరలో చివరి ఘట్టంగా అమ్మవారి విశ్వరూప దర్శనం బుధవారం జరుగుతుంది. బుధవారం ఉదయం అమ్మవారి శిరస్సు ఆలయంకు చేరుకున్న అనంతరం అమ్మవారి విశ్వరూప దర్శన భాగ్యం భక్తులకు కల్పిస్తారు. వేల సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి 11గంటల వరకు అమ్మవారి విశ్వరూప దర్శన కార్యక్రమం ఉంటుంది. అనంతరం అమ్మవారి జలవాసమేగే కార్యక్రమంతో జాతర ముగియనుంది.

# 29మంది అన్యమత ఉద్యోగులకు ఇంటికే !

### స్విమ్స్‌పూర్తిస్థాయి అభివృద్ధికి అదనంగా రూ.71కోట్లు నిధులు
### వెంకన్న ఆలయ భద్రతకు యాంటీడ్రోన్‌టెక్నాలజీ- టిటిడి బోర్డు నిర్ణయాలు

తిరుమల,మే 20(ప్రభాతవార్తప్రతినిధి:

హిందూ ధార్మికసంస్థ టిటిడి పరిధిలోని తిరుమల,తిరుపతిలో పలు కీలక విభాగాల్లో పనిచేస్తున్న 29మంది అన్యమతఉద్యోగులను స్వచ్ఛంద పదవీవిరమణ చేయాలని,ఇందుకు వారికి అదనంగా 5లక్షల రూపాయలు చెల్లించడానికి టిటిడి బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. అంగీకరించని వారిని తదుపరి రానున్న బోర్డు సమావేశంలో చర్చించి చర్యలు తీసుకునేందుకు చూస్తామని టిటిడి ఈఓ జో.శ్యామలరావు వెల్లడించారు. మంగళవారం ఉదయం అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన ధర్మకర్తలమండలి సమావేశం జరిగింది. టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, దేవాదాయశాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్, బోర్డు సభ్యులు చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.ఈ వివరాలను ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి మీడియాకు వివరించారు. అన్యమత ఉద్యోగులను ఏకంగా ఇళ్ళకే పంపించాలని బోర్డు నిర్ణయం తీసుకుని ఆమోదించింది. మిగిలిన రెండు విశ్రాంతి గృహాల పేర్లను టిటిడి మార్పుచేయాలని కూడా చర్చించి నిర్ణయం తీసుకున్నారు. రాయలసీమజిల్లాల్లోకే ఎంతో ప్రాధాన్యత ఉన్న తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలకు గాను ఇంకా అదనంగా 71కోట్ల రూపాయలు అందించేందుకు ఆమోదం తెలిపారు. విశ్రాంత ఈఓ ఐవి సుబ్బారావు నిపుణుల కమిటీ సిఫార్సు మేరకు వివిధ విభాగాల్లో 597 పోస్టులు భర్తీచేయాలని నిర్ణయించారు. శ్రీవారి వైద్యసేవద్వారా ఆసక్తివున్న వలంటీర్లు తో స్విమ్స్‌లో సేవలు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. స్విమ్స్‌లో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియమాకం కోసం అనుమతించారు. టిటిడి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ వల్ల తలెత్తిన సమస్యలు పరిష్కరించి పదోన్నతులు కల్పించేలా చూస్తామన్నారు. గోశాలలో గోవుల ఆరోగ్య రక్షణపై చర్యలు తీసుకున్నామని,త్వరలో



ఫలితాలు చూస్తారన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి మరింత భద్రత పెంచాలని నిర్ణయించారు.అటు శ్రీవారి ఆలయ భద్రత, ఇటు భక్తుల రక్షణ దృష్ట్యా ఇందుకోసం యాంటీడ్రోన్ టెక్నాలజీని వినియోగించాలని నిర్ణయించారు. ఈ బోర్డు సమావేశంలో బోర్డు సభ్యులు జి.భానుప్రకాష్‌రెడ్డి, సుచిత్ర ఎల్లా, ప్రశాంతిరెడ్డి, జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎన్.నర్సిరెడ్డి, జ్యోతులనెహ్రూ, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, మునికోటేశ్వరరావు, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# నాజిల్ మొరాయించడంతోనే రాకెట్ ఫెయిలైందా



శ్రీహరికోట (తడ), మే 20 ప్రభాతవార్త

శ్రీహరికోట నుంచి ఈ నెల 18న ప్రయోగించిన పిఎస్‌ఎల్‌వి-సి61 రాకెట్ విఫలమవడానికి కారణాలను అన్వేషిస్తూనే ఉన్నారు. ప్రత్యేకించి మూడవ దశలో నాజిల్ పనితీరుపై కొందరిలో అనుమానాలున్నాయి. రెండు దశలు సక్రమంగా జరిగిన తర్వాత మూడవ దశలో తలెత్తిన సాంకేతిక అవరోధం వల్ల రాకెట్ ఫెయిలైందని ఇస్రో గుర్తించింది. అయితే ఈ మూడవ దశలోని నాజిల్ పనితీరు మీద కొన్ని సందేహాలున్నాయి. రెండవ దశ నుంచి మూడవ దశకు ఘన ఇంధన మోటారు అంటుకునే సమయంలో కొంత ఆలస్యమైనా రాకెట్ వడివడిగా దూసుకెళ్లలేదు. ఘన ఇంధన కర్మాగారం (స్రాబ్) శ్రీహరికోటలోనే నిర్మించి ఉన్నారు. ఇప్పటికి ఎన్నో ఘన ఇందన మోటార్లను తయారు చేసి విజయవంతంగా పిఎస్‌ఎల్‌వి రాకెట్లను ప్రయోగించి ఉన్నారు. ఘన ఇంధన దశ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉండటమే కాకుండా శ్రీహరికోటలోని స్రాబ్‌లో పనిచేసే వారు ఎక్కువగానే ఉంటారు. అత్యంత క్లిష్టమైన ఈ దశలో ఇంధనం సమకూర్చడానికి శాస్త్రవేత్తలు అలవాటుగా మార్చుకున్నారు. షార్‌లోని ఘన ఇంధన కర్మాగారం వలన ఆ మోటార్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఇటువంటి అత్యంత కీలకమైన స్రాబ్‌లో ప్రస్తుతం పిఎస్‌ఎల్‌వి-సి61 రాకెట్‌లోని ఘన ఇంధన దశను కూడా ఏర్పాటు చేశారు. ఈ దశ సక్రమంగా పనిచేయకపోవడమే రాకెల్ ఫెయిలవడానికి ఒక కారణం కాగా, ఆ దశలోని నాజిల్ సరిగ్గా అంటుకోకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా విశ్లేషిస్తున్నారు. అయితే ఇస్రో శాస్త్రవేత్తలు దీన్ని ఇప్పటికీ ధ్రువీకరించలేదు. నాజిల్ వంటి చిన్న పరికరం సక్రమంగా పనిచేయలేదంటే అది శాస్త్రవేత్తల పనితనానికి సవాల్‌గా మారిందని పలువురు అంటున్నారు. త్వరలోనే ఈ అవాంతరాన్ని కనుక్కుని దాన్ని అధిగమించి మళ్లీ పిఎస్‌ఎల్‌విలతో విజయాల బాట పట్టాలని పలువురు కోరుకుంటున్నారు.



## పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి



పిడుగు పడి ఆవులు మృతి చెందిన ఆవులు, రోదిస్తున్న యాజమాని

శ్రీరంగరాజపురం, మే 20 ప్రభాతవార్త:

శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లి పంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట గ్రామ పరిసరాల్లో మంగళవారం పిడుగు పడటంతో రెండు ఆవులు మృతి చెందాయి. కృష్ణమూర్తి అనే రైతుకు చెందిన ఆవులపై పిడుగు పడటంతో రెండు ఆవులు ఒకేసారి మృతి చెందాయి. శ్రీరంగరాజపురం మండలంలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. పొలంకు సమీపంలోని చింతచెట్టుకు ఆవును కట్టి రైతు కృష్ణమూర్తి ప్రక్కనే వున్న షెడ్డులోకి వెళ్ళాడు. కొంత సేపటికి పెద్ద శబ్దంతో ఆ స్థలంలో పిడుగు పడటంతో రెండు ఆవులు ఒకేసారి మృత్యువాత పడ్డాయి. కృష్ణమూర్తి సైతం అక్కడిక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. కొద్దిసేపు అనంతరం పరిసరాల్లో వున్న ప్రజల అరుపులతో మెలకువలోకి వచ్చిన కృష్ణమూర్తి తన పాడి ఆవులు మృతి చెందడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఆవులతో పాలు పోసి జీవనాధారం చేస్తున్న తమకు అన్యాయం జరిగిందని రైతు భార్య తులసీ ఆవేదన వ్యక్తం చేసింది. కృష్ణమూర్తిని చికిత్స నిమిత్తం ఆరిమాకులపల్లి పిహెచ్‌సికి తీసుకెళ్ళి చికిత్స అందించారు.

# మూలపడ్డ కాంపాక్టర్లు: దుర్గంధంలో పుణ్యక్షేత్రం

### పొంచి ఉన్న రోగాలు:పారిశుద్ధ్యం ప్రశ్నార్థకం - మరమ్మతులకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
### తడిసి మోపెడౌతున్న బిల్లులు-ఇదీ శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పాలన తీరు

**శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని మున్సిపాలిటి పరిపాలనా తీరు ఆగమ్యగోచరంగా మారింది. వాతావరణం మార్పుతో రోగాల బారిన పడుతున్న జనం. పారిశుద్ధ్యం పనులకు కార్మికుల కొరత. కాలం చెల్లుతున్న కంపాక్టర్లు, ట్రాక్టర్లు. మరమ్మతులకు ముందుకు రాని కాంట్రాక్టర్లు. బిల్లుల చెల్లింపుకు అడ్డుగా మారిన నిబంధనలు. పట్టించుకోని కమిషనర్. కౌన్సిల్‌లేని శ్రీకాళహస్తి మున్సిపాలిటి. అభివృద్ధికి పరుగులు తీయాలంటున్న శాసనసభ్యుడు. ఆయన జోరుకు పరుగులు తీయలేని అధికారులు.**

శ్రీకాళహస్తి,మే 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం. ఇక్కడ జనాభా సుమారు లక్ష. ప్రతిరోజూ కనీసం 20వేల మంది శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వస్తుంటారు.వీరితో పాటు అతిథులు.వెరసి రోజు పట్టణంలో కనీసం 1.5లక్షలమంది వస్తుంటారు. గతంలో శ్రీకాళహస్తి పట్టణం నాలుగుమాడా వీధులు, పానగల్ మాత్రమే ఉండేది. ప్రస్తుతం విస్తరింపబ డుతున్న కాలనీలు.పట్టణానికి సుమారు 5కిలో మీటర్ల దూరంలో రాజీవ్‌నగర్ ఇక్కడ సుమారు పదివేల కుటుం బాలు, మరో వైపు ఎస్‌డికె నగర్ ఇక్కడ ఆకాశాన్ని తాకే బహుళ అంతస్థుల భవనాలు. మరో వైపు బైపాస్‌కు అవతల విశాలాక్ష్మ్మ నగర్ స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల వెనకాల అభివృద్ధి చెం దిన కాలనీలు. ఇంకొక వైపు చెర్లోపల్లి వరకు విస్తరించిన కాల నీలు ఇలా పట్టణం అభివృద్ధి చెందింది.

**పారిశుధ్య కార్మికుల కొరత:**

పదేళ్ళ క్రితం శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో 135 మంది రెగ్యూలర్ పారిశుధ్య కార్మికులు ఉండే వారు.నేడు వీరి సంఖ్య కేవలం 35మంది. ఇందులో మరో ఆరుగురు మృతి చెందారు.అంటే అర్హత కల్గిన పారిశుధ్య కార్మికులు కేవలం 29 మంది మాత్రమే. అవుట్ సోర్సింగ్ కార్మికులు 135 మంది. వీరిలో ఆరుగురు మృతి చెందారు. 129 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ప్రోటోకాల్‌కు రోజు ఏదో కార్యక్రమాలకు కనీసం 5



నుంచి 10 మందిని కేటాయించాలి. మున్సిపాలిటీలో 35 వార్డులు.వీరిలో కాలువలు శుభ్రం చేయాలి. ఆరు ట్రాక్టర్లకు సిబ్బందిని కేటాయించాలి. పట్టణంలో స్వీపింగ్‌కు 70మంది కావాలి.

**పురాతన కాలం నాటి కాలువలు:**

మున్సి పాలిటిలో 1972లో అప్పటి అవసరాలకు తగ్గట్లు మురుగునీటి కాలువలు నిర్మించారు. అవి నేటి అవసరాలను తీర్చలేకున్నాయి.ముఖ్యంగా నాలుగు మాడావీధుల్లో పరిస్థితి ఆగమ్యగోచరం. ఈకాలువలు నిర్మించినపుడు నాలుగుమాడావీధుల్లో నివాస యోగ్యమైన ఇళ్ళు నేడు నాలుగు మాడావీధుల్లో సుమారు 200 లాడ్జిలు వెలిసాయి. నాడు మరుగుదొడ్లకు పిట్‌లను తవ్వుకునే వారు నిండిన తరువాత శుభ్రం చేసుకునే వారు. కాలువల స్థాయి పెరగకుండా లాడ్జిల పైపులన్నీ కాలువల్లో వదలి పెడుతున్నారు. ఇక కాలువలన్ని ఆక్రమణలే. మున్సిపాలిటి పట్టించుకోదు. దాంతో రోజూ కాలువలు శుభ్రం చేసే పరిస్తితి లేదు.గతేడాది గెలిచిన శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి రూ.60లక్షలు ప్రత్యేక నిధులు సాధించి సిల్టు తొలగింపజేసారు.

**రెండేళ్ళుగా ట్రాక్టర్లను గురించి పట్టించుకోలేదు:**

పన్నులు వసూలు చేస్తున్నారు తప్ప ప్రజా సమ్యల పరిష్కారానికి అభివృద్ధికి వినియోగించటం లేదనే విమర్శలు బాహాటంగా ఉన్నాయి.రెండేళ్ళుగా చెత్తలను తొలగించే ట్రాక్టర్ల మరమ్మతుల గురించి పట్టించుకోవటం లేదు. ఇక్కడ వాహనాలను 13,14 ఎస్‌సి ప్లాన్‌లో వచ్చిన నిధులతో కొను గోలు చేసారు.ఇక్కడ కంపాక్టర్లు చిన్నవి రెండు పెద్దవి రెండు.ట్రాక్టర్లు 3 టిప్పర్ ఒకటి ఉంది. అయితే అన్ని మరమ్మత్తులకు వచ్చాయి. ఇప్పటికే గతంలో మరమ్మత్తులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.8లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉంది. దాంతో ఎవ్వరూ ముందుకు రావటం లేదు. ఇక ఈ ట్రాక్టర్లకు సంబంధించిన పెట్రోల్ బంకుకు లక్షల్లో బకాయిలు. అధి కారులకు ఇక్కడ చెల్లింపులు చేసే అధికారాన్ని గత పాలనలో రద్దు చేసి డైరెక్టర్ కార్యాలయం నుంచి చెల్లించే విధానం ఉండేది. కూటమి ప్రభుత్వం దానిని ర ద్దు చేసింది. కానీ అక్కడ ఉన్న బిల్లుల చెల్లింపు జరగలేదు. దాంతో శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పారిశుధ్యం అయోమయంగా మారింది.



# కలసికట్టుగా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

## - మినీ మహానాడులో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు



చిత్తూరురూరల్, మే 20 ప్రభాతవార్త:
నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు కలసికట్టుగా వుండి ప్రజా సమస్య లను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి పార్టీలు సమిష్టి కృషితోనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యిందని కూటమి ప్రభుత్వంను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత కూటమి నాయకులకే వుందన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం మినీ మహానాడు కార్యక్రమం జరిగింది. తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించి కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరులో ఎన్నికల వేళ అందరు కలసికట్టుగా పని చేయడంతోనే పార్టీకి విజయం దక్కిందన్నారు. 2009 సంవత్సరం నుండి తాను పార్టీ అప్పగించిన పనిని తాను చేశానని, 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో చిత్తూరు నియోజకవర్గం ఏర్పాటు అయినప్పటి నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసిన వారందరిని కలిసి ఒకే తాటిపైకి తీసుకురావడంతో చిత్తూరులో తెలుగుదేశం పార్టీ సునాయాస విజయం సాధించిందన్నారు. చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నానని, చిత్తూరును పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ఎలక్ట్రిక్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవే పనులు వేగంగా జరుగుతున్నాయని, బుల్లెట్ ట్రైన్ రానుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే సికె బాబు, పార్టీ పరిశీలకులు మారుతి చౌదరి, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, పరిశీలకులు సునీల్‌కుమార్, జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్, అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నాయకులు వసంత్‌కుమార్, త్యాగరాజన్, మోహన్‌రాజ్, పీటర్, రాజేశ్వరి, సుబ్బానాయుడు, శశికర్‌బాబు, జి.హేమాద్రినాయుడు, జయచంద్రబాబునాయుడు, సిఎం విజయ, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, క్లస్టర్, డివిజన్, గ్రామ పంచాయతీల పార్టీ అధ్యక్షులు, గుడిపాల, చిత్తూరు రూరల్, చిత్తూరు నగర పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

## ఇది కుంట కాదు...అరగొండ కొత్త బస్టాండే...



తవణంపల్లె, మే 20 ప్రభాతవార్త:
ఇది ఏ పొల్లాల్లో వుండే కుంట అనుకునేరు...కాదు నిత్యం వేల వాహనాలు రాకపోకలు సాగించే మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అరగొండలోని కొత్త బస్టాండు. 15 ఏళ్ళ క్రితం నిర్మించిన బస్టాండు సీసీ రోడ్డు అధికారుల నిర్లక్ష్యం ఫలితమే ఇది. వర్షం పడిన సమయంలో వరదనీరు బస్టాండు బయటకు వెళ్ళేందుకు వీలు లేకుండా ఇంజనీరింగ్ అధికారులు సీసీ రోడ్డు నిర్మించడంతో నడి బస్టాండులో సుమారు ఒక అడుగు లోతు వర్షపు బురదనీరు నిలిచిపోయి బస్టాండు కుంటను తలపిస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే ఈదారిన వెళ్ళే సుమారు 20 పైగా గ్రామాల ప్రజలు, వాహనదారులు, చిరు వ్యాపారులు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాకాలం రాకముందే బస్టాండును మరమ్మత్తులు చేయాలని మండల ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.

## మున్సిపల్ కార్మికుల సేవలు భేష్

### - ఎప్పటికప్పుడు పట్టణంలో శుభ్రత పనులు !!

కుప్పం, మే 20 ప్రభాతవార్త




జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మున్సిపల్ కార్మికులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. పగలు,రాత్రి ఇలా రెండు సమయాల్లోను పట్టణంలో పోగైన చెత్త చెదారాలను ఎప్పటికప్పుడు పోగు చేసి ట్రాక్టర్లలో తరలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ ఆదేశాలతో పట్టణంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం మొబైల్ మరుగుదొడ్లు సైతం ఏర్పాటుచేశామన్నారు. అలాగే తాగునీటి వసతికై చలివేంద్రాలు ప్రారంభించామన్నారు. పారిశుద్ధ్య కార్మికులను ఆయన ఈసందర్భంగా అభినందించారు.



## ఘనంగా తిరుపతి గంగమ్మ జాతర

సదుం, మే 20, ప్రభాతవార్త
సదం పంచాయతీ పరిధిలోని బట్టువారిపల్లి వద్ద వెలసిన శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో మంగళవారం జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సదుం నుంచి మహిళలు పెద్ద ఎత్తున మారుపొంగలతో ఆలయానికి విచ్చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ భిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు అన్నదానాలు ఏర్పాటు చేశారు. సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రేపు చౌడేపల్లిలో హనుమజ్జయంతి

చౌడేపల్లి, మే 20 ప్రభాతవార్త
స్థానిక కమలాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22న హనుమజ్జయంతి జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యేటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జయంతి ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు, ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యులు కోరారు.

## కలెక్టర్.. ఎస్పీలచే సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్.. ఎస్పీ

కుప్పం, మే 20 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు బుధవారం కుప్పంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. సిఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలకు ఆదేశించారు. ద్రవిడ వర్సిటీలో హెలిప్యాడ్, భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్యాలస్ రోడ్, నేతాజీ రోడ్లలలో ఏర్పాటైన దుకాణాలు, ఎగ్జిబిషన్ ప్రాంతాల్లో తిరిగి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, డిఎస్పీ పార్థసారథి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి దర్శనంకు గంట బ్రేక్

### భక్తులు సహకరించాలి : ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర

కుప్పంరూరల్, మే 20 ప్రభాతవార్త
కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ దర్శనానికి బుధవారం సిఎం చంద్రబాబునాయుడు కుటుంబసమేతంగా హాజరవుతున్న నేపథ్యంలో భక్తులకు గంటపాటు దర్శన బ్రేక్ ఇస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు తెలిపారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులందరికీ అమ్మవారి దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. దర్శనంకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సోమవారం శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ అగ్నిగుండ ప్రవేశం సందర్భంగా స్వల్పతోపులాటలు జరిగాయన్నారు. ప్రజలు, భక్తులు కూడా జాతర ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిఎం పిఎ మనోహర్, కమిటీ డైరెక్టర్ జయరాం నాయుడు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్‌చే 52వేల విరాళం

కుప్పంరూరల్, మే 20 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ తమ కుటుంబం తరపున శ్రీ తిరుపతి గంగమ్మ భూదాన కార్యక్రమంకు తమవంతుగా రూ 52,500ల రూపాయలు అందించారు. ఈమేరకు తమ విరాళాన్ని ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబుకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సతీమణి చంద్ర, కుటుంబీకులు మల్లేశ్వరి దినేష్, దివ్య ప్రేమ్‌కుమార్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## వి.కోట కేంద్రంగా శ్రీగంధం అక్రమ రవాణా

వి.కోట, మే 20 ప్రభాతవార్త



విలువైన శ్రీగంధం అక్రమ రవాణా వి.కోట కేంద్రంగా కొనసాగుతోంది. కొంతమంది మహిళలు నిత్యం పొలాల గట్లు, ప్రభుత్వ భూముల్లో ఉండే శ్రీగంధం చెట్లను కోసివేసి వాటి దుంగలను వి.కోటలో స్మగ్లర్లకు విక్రయిస్తున్నారు. ఇలా దుంగలు కొనుగోలు చేసిన స్మగ్లర్లు వాటిని బెంగళూరు నగరంలో పెద్ద వ్యాపారులకు విక్రయించి లక్షలు గడుస్తున్నట్లు సమాచారం. రామకుప్పం మండలంకు చెందిన కొందరు మహిళలు శ్రీగంధం అక్రమ రవాణా వృత్తిని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. వీరు మామూలు ప్రయాణీకుల్లా బస్సుల్లో చిన్న చిన్న బ్యాగులు తగిలించుకుని వాటి ద్వారా శ్రీగంధం దుంగలు తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శ్రీగంధం అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అడవి జంతువుల కోసం నీటి కుంటలు ఏర్పాటు చేయండి



పుంగనూరు రూరల్, మే 20, ప్రభాతవార్త
నియోజకవర్గంలో అడవి జంతువులు నీటి కోసం పొలాల్లోకి వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయని జనసేన చిత్తూరు జిల్లా ప్రోగ్రాం సెక్రటరీ చైతన్య రాయల్ తెలిపారు. అడవుల్లో చిన్న చిన్న నీటికుంటలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు మంత్రి నాదెళ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు అడవి శాఖ మంత్రివర్యులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

## లింగ వివక్షతను రూపు మాపాలి

సదుం, మే 20, ప్రభాతవార్త



లింగ విభక్షతను రూపుమాపేందుకు కృషి చేయాలని సమాజంలో అసమానతలు లేకుండా చూడాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఇంచార్జ్ సిడిపిఓ మల్లీశ్వరి అన్నారు. మంగళవారం సదుం పంచాయతీ లోని దిగువ జాంద్రపేటలో కిషోర్ వికాసం సమ్మర్ క్యాంపులో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళా పోలీస్ ఆసియా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిపించారు. బాలికలను సాధికారపర చడానికి వారికి సహాయ సహకారాలు అవసరమని చెప్పారు. బాలికలకు రోజువారి జీవితంలో అవసరమైన సేవలను భద్రత, విద్య నైపుణ్యాలను అందించడం వల్ల వారు ఎదుర్కొనే ప్రమాదాలను తగ్గించవచ్చని చెప్పారు. అదే విధంగా బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, లింగ నిర్ధారణ చట్టాలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్లు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

## అందుబాటులో ఉండి సరుకులు అందజేయాలి



సదుం, మే 20, ప్రభాతవార్త
రేషన్ షాప్ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సరుకులను అందజేయాలని తాసిల్దార్ జయప్రకాష్ నాయుడు అన్నారు. మంగళవారం ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తాసిల్దార్‌ను మండలంలోని డీలర్లు సంఘం అధ్యక్షుడు హేమచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో డీలర్లంతా కలిసి పుష్పగుచ్ఛము తోస్వాగతం పలికారు. శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలిగించకుండా పనులు చేసుకుంటే బాగుంటుందని చెప్పారు. అందరికీ అందుబాటులో ఉండాలని కోరారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పనులు చేసుకోవాలని చెప్పారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాణిపాకంలో ఘనంగా జూ.ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



కాణిపాకం, మే 20 ప్రభాతవార్త:
ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను కాణి పాకం ఎన్టీఆర్ ప్యాన్స్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అగరంపల్లె కూడలిలో ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. జూని యర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఈవేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా అగరంపల్లె ధియేటర్ దగ్గర కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎన్టీఆర్, నందమూరి అభిమానుల సంఘం పవన్‌కుమార్, నవీన్‌కుమార్, అనీష్ చౌదరి, రాజేష్, సతీష్,నాని, పాయి, వినాయక, గురులతో పాటు పలువురు అభిమానులు పాల్గొన్నారు.

## చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మరణహోమం

### చర్యలకు మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం డిమాండ్

చిత్తూరురూరల్, మే 20 ప్రభాతవార్త:
అపోలో సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగుల మరణహోమం జరుగుతోందని దీనిపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమసంఘ ఇన్‌ఛార్జీ, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిపై తాను గత 20 రోజులుగా పలు అభియోగాలు మోపుతున్నానని, అయితే ఆసుపత్రి యాజమాన్యం తన అభియోగాలపై నోరు మెదపడం లేదన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిపై తాను జరుపుతున్న పోరాటానికి ప్రతి ఒక్కరు మద్దతు తెలపాలని ఆయన కోరారు.

## పక్కాగా పిఎంఎజివై నిధులు ఖర్చు : జెడ్పీ సిఇఓ

చిత్తూరురూరల్, మే 20 ప్రభాతవార్త:
గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి మంజూరు అయితే పిఎంఎజివై నిధులను పక్కాగా ఖర్చు చేసి గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళాలని జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు పేర్కొన్నారు. జడ్పీ సమావేశభవనంలో మంగళవారం జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు పిఎంఎజివై నిధులు మంజూరు అయిన పంచాయతీలకు చెందిన గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని 23 మండలాల్లో 23 గ్రామ పంచాయతీలకు పిఎంఎజివై నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఒకొక్క గ్రామ పంచాయతీకి పిఎంఎజివై కింద 20 లక్షల నిధులు మంజూరు అయ్యాయని, ఈ నిధులతో ఆ గ్రామ పంచాయతీల్లో సిమెంటు రోడ్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణం, డ్రైనేజీ ఏర్పాటు తదితర పనులు చేపట్టాలన్నారు. ఈ పనులకు సంబంధించి ప్రతిపాదనలను సత్వరం రూపొందించి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇఓఆర్డీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణంపై విజిలెన్స్ తనిఖీ




బంగారుపాళ్యం, మే 20 ప్రభాతవార్త:
బంగారుపాళ్యంలోని బిస్మిల్లా ట్రేడర్స్ ఎరువుల దుకాణంను మంగళవారం తిరుపతి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దుకాణ యాజమాని అధిక ధరలకు ఎరువుల అమ్మకాలు చేపడుతున్నారని అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా ఎరువుల అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. సరైన ఇన్‌వాయిస్‌లు, రైతులకు రసీదులు ఇవ్వడం లేదని, రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని తనిఖీలు తేలింది. దుకాణంలోని రూ.1.35 లక్షల 200 బస్తాల ఎరువుల పూర్తిగా సీజ్ చేసినట్లు వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారి రామాంజనేయరెడ్డి తెలిపారు. అలాగే దుకాణంకు చెందిన ఎరువుల లైసెన్సును పూర్తిగా రద్దు చేయడానికి సిఫార్సు చేస్తున్న ట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలో విజిలెన్స్ ఎస్ఐ వెంకటరమణ, ఎఓ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల పట్ల లింగ వివక్షత లేకుండా సమానంగా చూడాలి



తవణంపల్లె, మే 20 ప్రభాతవార్త:
బాలికల పట్ల లింగ వివక్షత లేకుండా పురుషులతో సమానంగా చూడాలని ఐరాల సీడీపీఓ జి.నిర్మల అన్నారు. మంగళవారం మండల కేంద్రం తవణంపల్లె బీసీ కాలనీ, తడకర గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆడపిల్లల పట్ల లింగ వివక్షత. అసమానతల గురించి ఆయా అంగన్ వాడీ సెంటర్లలో అవగాహన కార్య క్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తు సమాజంలో మహిళలపై లింగ వివక్షత విస్తృతంగా వుందన్నారు. కావున సమాజంలోని మహిళల పట్ల వున్న లింగ వివక్షతను, అసమానతలను రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీకి 5.20 కోట్ల నిధులు విడుదల

కుప్పం, మే 20 ప్రభాతవార్త
కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు గ్రాంటు కింద 5.20 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. ఈమేరకు మంగళవారం ప్రభుత్వ కార్యదర్శి రొనాల్డ్ రోస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనిధులను ద్రవిడ వర్సిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలుగా చెల్లించనున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ సిఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## అమ్మవారికి మొక్కు చెల్లించుకున్న ప్రభుత్వ విప్ కంచర్ల

కుప్పం, మే 20 ప్రభాతవార్త



కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ తల్లికి ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మొక్కు చెల్లించుకున్నారు. అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా అమ్మవారికి గొర్రెను కానుకగా సమర్పించారు. స్వయంగా ఆయన అమ్మవారి ఉత్సవాన్ని మోశారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలకు భోజనాలను స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ ముని రత్నం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అధ్యక్ష పదవులకు పోటా పోటీ -సమీకరణలతో సమన్యాయానికి ఎంఎల్ఏ కసరత్తు

శ్రీకాళహస్తి,మే 20 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ మహానాడులోపల మండల,మున్సిపల్ పరిధిలోని అధ్యక్ష పదవులను ఖరారు చేయాలని స్థానిక శాసనసభ్యులకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు,ఒక మున్సిపల్ పరిధిలో అధ్యక్ష పదవుల నియామకానికి ఎంఎల్ఏ సుదీర్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు. వివిధ సమీకరణలతో అందరికి సమన్యాయం చేయటానికి ఆయన పరిశీలిస్తున్నారు. మూడు సార్లు పదవులు నిర్వహించిన వారికి అవకాశం లేకుండా కొత్త వారికి అవకాశం కల్పించాలని ఆదేశించటంతో సమీకరణలలో తలమునకలై ఉన్నారు. శ్రీకాళహస్తి మున్సి పాలిటీలో మూడు సార్లుగా జి.విజయకుమార్ బాధ్యతలు నిర్వహిస్తు న్నారు. ప్రస్తుతం ఇక్కడ బిసిలకు అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. విజయకుమార్ నియామకంలో పరిశీలించాలని అభ్యర్థించినట్లు సమాచారం. బిసిలకు అవకాశం కల్పిస్తే మాజీ మున్సిపల్ చైర్మెన్ పేట రాధారెడ్డి కుటుంబ సభ్యుడు పేట బాలాజి పేరు పరిశీలనలో ఉన్నట్లు చర్చించుకుంటున్నారు. కాగా శ్రీకాళహస్తి మునిసిపాలిటిలో బిసిలకు ఇస్తే శ్రీకాళహస్తి మండలం అధ్యక్ష పదవి ఖరారు సులభమౌతుంది. ఈ నేపథ్యంలో బిసిలు (వన్నెకుల క్షత్రియ) వేడాం పరిసరాలకు చెందిన దొరైరాజ్ పేరుతో పాటు యాదవ్‌సమాజిక వర్గం నుంచి ఆది నుంచి తనతో కలిసి నడుస్తున్న డాక్టర్ కృష్ణయాదవ్ ఆశిస్తున్నట్లు సమాచారం. శ్రీకాళహస్తి మున్సిపాలిటి ఏ సామాజిక వర్గానికి కేటాయిస్తే శ్రీకాళహస్తి మండలంలో సమీకరణలు మారుతాయి. ఇక ఏర్పేడు మండలంలో ముగ్గురు తమకు పార్టీ అధ్యక్షపదవి కావాలని కోరుతున్నట్లు సమాచారం, కమ్మ సామాజిక వర్గం నుంచి పేరం నాగరాజు నాయుడు, బాబునాయుడు,యాదవ్ సమాజిక వర్గానికి చెందిన గుణయాదవ్‌లు కోరుతున్నట్లు సమాచారం.పేరం నాగరాజు నాయుడుకు మొగ్గుచూపుతున్నట్లు చర్చించుకుంటున్నారు.అయితే శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్ని వర్గాలను సంతృప్తి పరచుటకు సమన్వయం చేసుకుంటూ సమీకరణలతో జాబితాలను సిద్ధం చేసుకుంటున్నారు. బుధవారానికి మండల అధ్యక్షులను ఖరారు చేయనున్నట్లు తెలిసింది.

## తుమ్మలగుంట టీడీపీ అధ్యక్షులుగా భరత్‌కుమార్‌రెడ్డి



తిరుపతి రూరల్, మే 20 ప్రభాతవార్త : తుమ్మలగుంట సీనియర్ నాయకులు దొడ్ల కరుణాకర్‌రెడ్డి అండదండలు, తుమ్మలగుంట టీడీపీ పార్టీ కుటుంబ సభ్యుల మద్దతుతో తుమ్మలగుంట టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి అలియాస్ బాను నియమితులైయ్యారు. ఈ సందర్భంగా వారికి భరత్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం తుమ్మలగుంట నుంచి టీడీపీ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి మర్యాద పూర్వకంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కలిసి శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

## కౌటిల్య విద్యార్థికి ఐసెట్‌లో స్టేట్ రెండవ ర్యాంకు

తిరుపతి రూరల్, మే 20 ప్రభాతవార్త : ఎమ్మార్‌పల్లి సర్కిల్ వద్ద ఉన్న కౌటిల్య ఇనిస్టిట్యూట్ సంస్థకి చెందిన విద్యార్థి ద్వారకచర్ల సందీప్‌రెడ్డికి మంగళవారం విడుదలైన ఐసెట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించాడు. ఇతను ప్రస్తుతం కౌటిల్యలో జాతీయ స్థాయి పరీక్ష క్యాట్‌కు సన్నద్ధమవుతున్నాడు. వీరితోపాటు మరికొంత మంది కౌటిల్య విద్యార్థులకు ఐసెట్‌లో మంచి ర్యాంకులు సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, ఫ్యాకల్టీ, సీనియర్ మేనేజర్ ఎన్ఎస్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు, పదిలోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందించారు. కౌటిల్యలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఇస్తున్న అత్యుత్తమ శిక్షణను గురించి డైరెక్టర్ శ్రీధర్ వివరించారు.

## దౌర్జన్యంగా ఇంట్లో చేరారు... ఖాళీ చేయడం లేదు!

రేణిగుంట, మే 20 ప్రభాతవార్త: రేణిగుంట తిరుపతి మార్గంలోని ఉప్పరపాలెం వద్దగల శ్రీమాన్ నారాయణ అపార్ట్మెంట్లోని 101వ నంబరు తాళం వేసిన ఫ్లోర్ నందు ఓ కుటుంబం మూడు నెలల క్రితం దౌర్జన్యంగా చేరారని, ఇంటి యజమానురాలు వసంతమ్మ భర్త ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో చేరిన వారు ఖాళీ చేయమంటే ఖాళీ చేయకుండా తమపై వాగ్వివాదానికి దిగుతున్నారని బాధను వ్యక్తం చేశాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసామన్నారు. తక్షణం పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

## స్కిల్ హబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి విద్య, మే 20 ప్రభాతవార్త : ఎస్వీ మెడికల్ కళాశాల ఎదురుగా అలిపిరి రోడ్డులో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్) సంయుక్తంగా నిర్వహిస్తున్న స్కిల్ హబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ట్రైనర్లు కిరణ్, సాయిలక్ష్మి, నీరజ తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9701440274, 9703437472, 9866241270లను సంప్రదించాలన్నారు.

## ఆన్‌కాల్ డ్రైవర్లకు దరఖాస్తుల ఆహ్వానం

తొట్టంబేడు, మే 20 ప్రభాతవార్త : ఏపిఎస్ఆర్టీసి శ్రీకాళహస్తి డిపోలో ఆన్ కాల్ పద్ధతిలో డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వారికి ఉన్న హెవీ లైసెన్సు తీసుకున్న తర్వాత 18 నెలలు పూర్తయిన వారు, ఆధార్‌కార్డును మరియు దరఖాస్తును డిపో మేనేజర్ కార్యాలయంలో ఈనెల 24వ తేదీ శనివారం ఉదయం నుంచి సాయంత్రం లోపు సమర్పించాలన్నారు. వివరాలకు 9959297947, 9063774464 ఫోన్‌చేసి తెలుసుకోవచ్చున్నారు.

## గంగమ్మను దర్శించుకున్న మాజీ చైర్మన్



శ్రీకాళహస్తి, మే 20 ప్రభాతవార్త: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ గంగమ్మ జాతర సందర్భంగా శివయాదవ్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారక శ్రీనివాసులు గంగమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందించి శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ**

పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ జాతర సందర్భంగా మాజీ ఎంఎల్ఏ బియ్యపుమధుసూధనరెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి విచ్చేసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆమెకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యులు స్వాగతం పలికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందుకున్నారు.కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా గోవర్ధన్



విజయపురం, మే 20 ప్రభాతవార్త: వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా మండలానికి చెందిన ఎం.అగరం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, నగరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ గోవర్ధన్‌నాయుడు ఎంపికైన సందర్భంగా మంగళవారం నగరి పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి రోజాకుు శాలువ కప్పి కృతజ్ఞతలు తెలిపారు. గోవర్ధన్ నాయుడు నియామకం పట్ల వైసీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శివరాజు, ఉపాధ్యక్షుడు సతీష్‌యాదవ్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు బాలకృష్ణమనాయుడు, శేఖర్ రాజు, రవినాయుడు, నాగరాజు, రమేష్‌రెడ్డి, అరుణాచలం, ప్రసన్న, శ్రీరాములురెడ్డి, సుబ్బుయాదవ్, పలువురు నాయకులు, కార్యకర్తలు వారికి అభినందనలు తెలిపారు.

## 23న కేవీపురం సచివాలయం ఎదుట రిలే నిరాహారదీక్ష

విజయపురం, మే 20 ప్రభాతవార్త: ఈ నెల 23న శుక్రవారం ఉదయం 10 గంటలకు మండలంలోని కేవీ పురం సచివాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో దళితులు రిలే నిరాహారదీక్ష నిర్వహిస్తున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీ పేరుతో కేవీ పురం గ్రామ రెవెన్యూ సర్వే నెం.183లో సుమారు 78 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. కానీ ఇప్పటి వరకు లబ్ధిదారులకు సంబంధిత రెవెన్యూ అధికారులు స్థలాలు చూపించలేదని, పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లబ్ధిదారులకు స్థలాలు చూపించాలని, లేని పక్షంలో నిరవధిక నిరాహారదీక్షకు దిగుతున్నట్లు ఆయన తెలిపారు.

## టయోటా కిర్లోస్కర్ మెగా సమ్మర్ సెలబ్రేషన్

తిరుపతి విద్య, మే 20 ప్రభాతవార్త : వేసవిని పురస్క రించుకుని టయోటా కిర్లోస్కర్ మోటర్ మెగా సమ్మర్ సెలబ్రేషన్ ప్రారంభిం చినట్లు ఆ సంస్థ సౌత్ రీజియన్, చీఫ్ రెప్రజెంటేటివ్ వైస్ ప్రెసిడెంట్,వైస్ లైన్ సిగామణి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని అధీకృత టొయోటా డీలర్షిప్లలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. కొత్త కారు కొనడం,ఉన్న కార్లకు సర్వీసింగ్ చేయడం,సర్టిఫైడ్ యూజ్డ్ కార్లను గుర్తించటం, వాహన ఉపకరణాలను అప్గ్రేడ్ చేయడం,ఆకర్షణీయమైన డీల్‌ను పొందటం దీనితో సాధ్యమవుతుందన్నారు.

## దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ



భాకరాపేట, మే 20 ప్రభాతవార్త: దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక సేవలు అందించేందుకు భవిత కేంద్రాలు ఏర్పాటు చేసిందని తిరుపతి జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం చిన్నగొట్టిగల్లు మండలంలో పర్యటించారు. అయన తల్లి తండ్రులతో మాట్లాడుతూ భవిత కేంద్రంలో స్పీచ్ తెరపి, ఫిజియోథెరపీ, ఉచిత హియరింగ్ (చెవిటి మిషన్లు) తదితర ఉపకరణాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వై. సత్యనారాయణ, బి.గోపీనాథ్ ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు వెంకటరమణ, రమణయ్య పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురైన మెకానిక్‌కు ఆర్థిక సాయం



తిరుపతి కలెక్టరేట్, మే 20 ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి గురైన మెకానిక్ భాస్కర్ నాయుడుకు పది వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం తిరుపతి జిల్లా టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి అందజేశారు. భాస్కర్‌నాయుడు లక్ష్మీపురం సర్కిల్‌లోని మెకానికల్ షాపును నడుపుకుంటూ ప్రమాదవశాత్తు కాలు విరిగి ఆపరేషన్ అయిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని ఆదుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు ఆవుల మునిరెడ్డితో పాటు ఉపాధ్యక్షులు ప్రభు, సెక్రటరీ జలంధర్, జాయింట్ సెక్రటరీ గురుచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, ట్రెజరర్ బాబు, కమిటి ఇన్‌చార్జి కేశవ, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త లేఔట్ల స్థలాలను పరిశీలన చేస్తున్నాం : తుడా ఉపాధ్యక్షులు



తిరుపతి కార్పొరేషన్, మే 20 ప్రభాతవార్త : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోని సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో కొత్తగా లేఅవుట్లు ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలన చేస్తున్నామని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అన్నారు. మంగళవారం తుడా అధికారులతో కలసి నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో లేఅవుట్లు వేయడానికి అనువైన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారంగా తుడా పరిధిలో ప్రజలకు ఉపయోగకరంగా ఉండే భూములను గుర్తిస్తున్నామని అన్నారు. ఆ భూములు కొనుగోలు చేసి అందులో లేఅవుట్లు వేసి అభివృద్ధి చేస్తామని అన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఉపాధ్యక్షులను కలిసి సూళ్లూరుపేట లోని పార్కును, రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. తుడా పరిధిలో బడ్జెట్ పరిశీలించి అన్ని పనులు చేయిస్తామని అన్నారు. ఈ స్థల పరిశీలనలో తుడా సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఇఇ రవీంద్ర, సిపిఒ దేవికుమారి, ఎల్.ఏ.ఓ. సుజన, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## చెత్త కుప్పను తలపిస్తున్న బ్యాంక్ ఏటీఎమ్



పాకాల, మే 20 ప్రభాతవార్త: మండలంలోని స్థానిక ఎస్‌బిఐ బ్యాంక్ కింద ఏర్పాటు చేసి ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఎటిఎం సరైన మెయింటెనెన్స్ లేక చెత్తాచెదారంతో నిండి తీవ్ర దుర్గంధ భరితమై వినియోగదారులు ఇబ్బందులు పడే విధంగా పరిస్థితి నెలకొని ఉంది. వినియోగదారుల నుంచి ఏటీఎం సేవల కొరకై చార్జీలు వసూలు చేసే యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం ఆర్‌బిఐ నిబంధనల మేరకు ఏటీఎం మెయింటెన్ చేయడంలో తీవ్రంగా విఫలమైనది అని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సదరు బ్యాంక్ యజమాన్యం పాకాల ఏటీఎం పై దృష్టి సారించి సరైన మెయింటెనెన్స్ చేయవలసినదిగా కస్టమర్స్ కోరుతున్నారు.

## రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : సీపీఎం

కేవీబీ పురం, మే 20 ప్రభాతవార్త: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ మండల వ్యవసాయ అధికారికి, తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. జనార్ధన్ మాట్లాడుతూ కేవీబీపురం మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన యువ రైతు చంద్రబాబు వ్యవసాయం కొరకు చేసిన అప్పును తీర్చలేక అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, మరణించిన రైతు తండ్రి జూలయ్య, తమ్ముడు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల ద్వారానే ఆర్థిక సాధికారత



పుత్తూరు రూరల్, మే 20 ప్రభాతవార్త: మహిళా సంఘాల ద్వారానే ఆర్థిక సాధికారిత అని పుత్తూరు కెనరా బ్యాంకు మేనేజర్ నరసింహులు తెలిపారు. రాష్ట్రీయ సేవా సమితి రాస్ సంస్థ మహిళ పొదుపు సంఘ సభ్యుల సౌకర్యార్థం క్లాస్ ప్రాంతీయ కార్యాలయంలో టైలరింగ్ శిక్షణ ముగింపు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కెనరా బ్యాంకు మేనేజర్ నరసింహులు పాల్గొని ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు సభ్యులు ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలు చేత వృత్తుల శిక్షణ నేర్చుకోవడం, ద్వారా ఆర్థిక క్రమశిక్షణ కాకుండా మహిళా సాధికారత సాధ్య పడుతుందని, ఆర్థిక క్రమాలకు కెనరా బ్యాంకులో ద్వారా రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఒక ఇంట్లో మహిళలు చైతన్యవంతులు అయితే ఆ కుటుంబం అన్ని రంగాల్లో ముందుంటుందని తెలిపారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన వారికి ఉచితంగా 15 వేలు విలువచేసే కుట్టు మిషన్లు, వీరికి ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, జయంతి, ప్రకాష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులర్ తహశీల్దార్‌గా రాజశేఖర్



సత్యవేడు, మే 20 ప్రభాతవార్త: సత్యవేడు రెగ్యులర్ తహశీల్దార్‌గా రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం రాజశేఖర్ వరదయ్యపాళెం తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న టి.వి.సుబ్రహ్మణ్యం డిప్యూటేషన్‌పై బదిలీ కావడం జరిగింది. దీంతో వరదయ్యపాళెం తహశీల్దార్‌గా పని చేస్తున్న రాజశేఖర్‌కి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. కాగా వరదయ్యపాళెం నూతన తహశీల్దార్‌గా సుధీర్‌ని నియమించినట్లు సమాచారం.

## తుడా చైర్మెన్ పదవి ప్రమాణస్వీకారానికి కదలాలి! : కోలా

శ్రీకాళహస్తి,మే 20 ప్రభాతవార్త : తుడా చైర్మెన్‌గా డాలర్ దివాకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి శ్రీకాళహస్తి నుంచి అభిమానులు,కార్యకర్తలు కదలి వెళ్ళాలని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ మంగళవారం పిలుపు నిచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఒక గంటలకు పట్టణంలోని సంతమైదానంలోని తన నివాసం వద్ద నుంచి బయలుదేరటానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. శ్రీకాళహస్తి రూరల్, ఏర్పేడు, రేణిగుంట మండలాలకు చెందిన అభిమానులు, ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు గాజులమండ్యం పోలీసుస్టేషన్ వద్దకు చేరుకొని అక్కడ నుంచి ర్యాలిగా కదలి వెళ్ళాలని ఆనంద్ పిలుపు నిచ్చారు.ఈ మేరకు శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని కార్యకర్తలు తమ నివాసం వద్ద నుంచి బయలు దేరటానికి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.శ్రీకాళహస్తి పుత్తూరు ప్రాంతానికి చెందిన వారు మధ్యాహ్నం 2గంటలకు బయలుదేరి టౌన్ క్లబ్ వద్ద సమావేశం కావాలని అక్కడ నుంచి 3గంటలకు భారీ ర్యాలి ఉటుందని ప్రతి ఒక్కరు సహకరించాలని కోలా ఆనంద్‌కుమార్ పిలుపు నిచ్చారు.

## జాతరలో అన్నదానం



శ్రీకాళహస్తి,మే 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ఎన్టిఆర్‌నగర్‌లో మంగళవారం జరిగిన గంగమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో వైకాపా మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనంరెడ్డి సతీమణి శ్రీవాణి కార్యకర్తలతో కలసి పాల్గొన్నారు. గంగమ్మకు ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి గంగమ్మ కమిటి ఘనస్వాగతం పలికారు. అన్నదాన కార్యక్రమాల్లో ఆమెతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, శివకుమార్ యాదవ్, కంచి గురవయ్య, పఠాన్ ఫరీద్ మున్నారాయల్, చంద్ర, రేవంత్, యోగా, బావాజి, సూరి, సాయి, రాజశేఖర్, ఇమ్రాన్, భాను, ముని,ప్రవీణ్, మోహన్, అయ్యోరు, బాబాయ్, రెడ్డిబాషా, చెంచురాయి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత విద్యార్థిపై దాడి చేయడం అమానుషం!



రేణిగుంట మే 20 ప్రభాతవార్త : దళిత విద్యార్థి జేమ్స్ పై జరిగిన దాడి అమానుషమైన చర్యని అఖిలభారత అంబేద్కర్ యువజన సంఘం తిరుపతి పార్లమెంటరీ సెక్రటరీ కంజాక్షి కుమార్, రేణిగుంట మండల కన్వీనర్ చంద్రవేలు సంయుక్తంగా ఖండించారు. దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితులు కేవలం ఓటర్లు గానే మిగిలిపోతున్నారు తప్ప అధికారానికి దగ్గర కాలేకపోతున్నారు అన్నారు.

## ప్రకాశం పంతులుకి ఘన నివాళి

తిరుపతి విద్య, మే 20 ప్రభాతవార్త: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పరిపాలనా భవనంలోని ఆయన విగ్రహం దగ్గర ఉదయం స్మారక కార్యక్రమం జరిగింది. యస్వీయూ ఉపకులపతి ఆచార్య సిహెచ్.అప్పారావు ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడతు టంగుటూరి ప్రకాశం పంతులు ఒక మహోన్నత వ్యక్తిత్వం గల వారు. ముఖ్యంగా విద్యారంగంలో బలమైన పునాదులు వేసిన దార్శనిక రాజనీతిజ్ఞుడు కూడా కొత్తగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రం మొదటి ముఖ్యమంత్రిగా ఆయన దార్శనిక నాయకత్వంలో 1954లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉద్భవించింది.రాయలసీమ ప్రాంతంలో ఒక ప్రముఖ ఉన్నత విద్యా సంస్థను ఏర్పాటు చేయడంలో ఆయన దూరదృష్టి మరువలేనిది అని అన్నారు.రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు టంగుటూరి ప్రకాశం పంతులు న్యాయవాదిగా గడించిన అనుభవం విద్య ,సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన అచంచలమైన నిబద్ధత మనలాంటి సంస్థలు అభివృద్ధి చెందడానికి మార్గం సుగమం చేసింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొని, ఆ నాయకుడికి నివాళులర్పించారు,

## తెదేపా పట్టణాధ్యక్షురాలి కుమార్తెకు మాస్టర్స్ పట్టా



శ్రీకాళహస్తి, మే 20 ప్రభాతవార్త : పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు కుమార్తె అమెరికాలోని బోస్టన్ నార్త్ యూనివర్సిటీలో చదువుతోంది. దీంతో మంగళవారం అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో విజయకుమార్ కుమార్తె గెడిపూడి వైష్ణవి మాస్టర్ ఆఫ్ సైన్స్‌లో డేటా అనాలసిస్ ఇంజనీరింగ్‌లో పట్టా సాధించి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈసందర్భంగా వైష్ణవిని పలువురు అభినందించడంతో పాటు ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలిపారు.

## పార్టీకి కట్టుబడిన వారికి ప్రత్యేక గుర్తింపు: బొజ్జల



శ్రీకాళహస్తి,మే 20 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణతో కట్టుబడిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుం దని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళ వారం తెలుగుదేశం పార్టీ పట్టణ కమిటి కార్యనిర్వాహక కార్యదర్శి కిషోర్ క్రమశిక్షణ కల్గిన యువ నాయకుడు అన్నారు.తాను నమ్మిన సిద్దాంతాలను పాటిస్తూ పార్టీ అప్పగించిన పనిని జవాబుదారి తనంతో ఆచరించే నాయకుడు కిషోర్ అని సుధీర్‌రెడ్డి అభినందించారు. రాబోవు రోజుల్లో రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా భగవంతుని ఆశీస్సులు ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభినందించారు.ఈ కార్యక్రమాల్లో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి, కార్యదర్శి గుమ్మడి దశరధాచ్చారి, గాలిచలపతినాయుడు, డాక్టర్ యం.ఉమేష్‌రావు, రావిళ్ళ మునిరాజానాయుడు,డివి నారాయణ, దుర్గా ప్రసాద్,రవీంద్రనాథ్‌రెడ్డి, ఢిల్లిబాబు,వినయ్, భాస్కర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాల ఆవిష్కరణ



తొట్టంబేడు, మే 20 ప్రభాతవార్త : అందరివాడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మరియు బిసిల నాయకుడు ఆదర్శ ప్రాయుడు జ్యోతిరావు పూలే అని ఎంఎల్ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దకనపర్తి గ్రామంలో ఇద్దరి విగ్రహాలను ఎంఎల్ఏ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి పరసారత్నం, రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజనాయుడు, తాజామాజీ మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, తేదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, పూడి మాజీ సర్పంచ్ మునిరత్నంలు హజరయ్యారు. ముందుగా ఎంఎల్ఏ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బిసిలకు ఆదర్శప్రాయుడు జ్యోతిరావు పూలే విగ్రహాలు రెండు ఒకేచోట ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. గ్రామంలోనే చదువుకుని ఉన్నతస్థాయికి చేరిన శ్రీనివాస్ ఇద్దరి మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడంలో ఆయన తీసుకున్న చొరవ ఎంతో మంచిదని శ్రీనివాస్‌ను అభినందించారు. మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ ఇద్దరి మహనీయులు విగ్రహాలు ఏర్పాటు చేయడం పెద్దకనపర్తి గ్రామంలోనే చూస్తున్నామన్నారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్దే ప్రధాన లక్ష్యంగా ఉందని ఇప్పటికే శ్రీకాళహస్తిలో రోడ్డు బాగు చేయడంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొట్టేసాయి, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రీన్‌ప్యానల్ ఆధ్వర్యంలో ఆర్ఓ ప్లాంటు ఏర్పాటు



తొట్టంబేడు, మే 20 ప్రభాతవార్త : మండలంలోని పెద్దకన్నలి పంచాయతీ ఎస్టీ కాలనీలో రౌతు సూరమాల గ్రామ సమీపంలో ఉన్న గ్రీన్ ప్యానల్ పరిశ్రమ ఆధ్వర్యంలో సిఎస్ఆర్ నిధుల కొంద ఆర్ఓ ప్లాంటును ఎంఎల్ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామస్తుల వినతి మేకు ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన గ్రీన్ ప్యానల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరు ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఏ పిలుపునిచ్చారు. అలాగే మరిన్ని ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఎంఎల్ఏ కోరారు. కార్యక్రమంలో ఎంఎల్ఏతో పాటు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్, మాజీ మంత్రి పరసారత్నం, రాష్ట్ర తెదేపా కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళమునిరాజనాయుడు, మాజీ తెదేపా అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, కన్నలి ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మునిరత్నం, గ్రీన్ ప్యానల్ లైజనింగ్ హెచ్ఆర్ బాలాజీ, హెచ్ఆర్‌లు బాలసుధీర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానానికి విరాళం



శ్రీకాళహస్తి,మే 20 ప్రభాతవార్త: చారిత్రత్మాక దివ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందుతున్న గుడిమల్లం ఆలయానికి అతిథులతో పాటు ఇక్కడ నిర్వహించే నిత్యాన్నదానానికి విరాళాలు విరివిగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం పరశురామేశ్వరుని సన్నిధిలో రేణిగుంట డివైయస్‌పి శ్రీనివాసరావు కుటుంబసభ్యులతో స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఇఒ రామచంద్రారెడ్డి ఆలయ అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు.స్వామి మూల విరాట్టును దర్శించుకున్న డివైయస్‌పి శ్రీనివాసరావు ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకాన్ని చేసి సంతోషించారు. వవెంటనే తన ఇద్దరు కుమారులు చైతన్య ప్రవీణ్,ప్రవీణ్ కృష్ణతేజ జన్మదినం సందర్భంగా నిత్యాన్నదానపథకానికి రూ.5116లు విరాళం ఇఒ రామచంద్రారెడ్డికి అందించారు.

## ఘనంగా ప్రారంభమైన మినీ మహానాడు



తిరుపతి రూరల్, మే 20 ప్రభాతవార్త : తిరుపతి రూరల్ మండలం తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్ చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నాని అధ్యక్షతన ఘనంగా మినీ మహానాడు ప్రారంభమైంది. నియోజక వర్గ నాయకులను, కార్యకర్తలను, ప్రజలను నాని పేరు పేరునా అప్యాయంగా పలకరించారు. పార్టీ కార్యాలయ ఆవరణంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. నియోజక వర్గంలో మృతి చెందిన టీడీపీ కుటుంబ సభ్యులకు నివాళులర్పించారు. పార్టీలకు అతీతంగా నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సినీ నటుడు కమల్‌హాసన్‌లా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నటిస్తున్నారని, ఆయనలా నేను నటించలేనని, అలాగే కుటుంబ పాలన చేయను అన్నారు. చెవిరెడ్డి పాలనలో నియోజక వర్గం 25 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందని ఆరోపించారు. చెవిరెడ్డి మనలో విభేదాలు తేవడానికి ప్రయత్నిస్తున్నాడని, వాటిని మనం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ ప్రజలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank
అలిపిరి బైపాస్‌రోడ్డు శాఖ, తిరుపతి, తిరుపతిజిల్లా ఫోన్: 7013401298

**బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినను ఐట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. 30.05.2025 వ తేదీ లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో తేది:31.05.2025 సా.4.00గం||లకు లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| క్ర. నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం రూ. |
|---|---|---|---|---|
| 1 | 164013634383 | ఎస్.వసుంధర భర్త కె.వంశీకృష్ణ, 21-9-65, శివజ్యోతినగర్, తిరుపతి - 517501 | 33.000 | 1,20,000.00 |

తిరుపతి, తేది: 20.05.2025 సం|| బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

## పథకాలు అందలాంటే ముఖచిత్రం తప్పనిసరి



కోట,మే 20 ప్రభాతవార్త: స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లబ్దిదారులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అందలాంటే ప్రతి ఒక్కరు తప్పని సరిగా ముఖచిత్రం ( ఫెస్ క్యాపెచర్ )తీసుకోవాలని ఐసీడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంత్ బాయ్ కోరారు. ఆమె మంగళవారం కోటలోని ఐసిడిఎస్ కార్యాల యాలంకు విచ్చేశారు. అనతరం శ్యామ్ సందర పురంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడ నుంచి బాలసదన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టె పరిధిలోని లబ్దిదారులు తప్పనిసరిగా ముఖచిత్రం తీసుకోవాల్సి ఉందన్నారు. దీని వలన ఎవరు ఎవరు కి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదానని స్పష్టంగా తెలుసుకోవచ్చారు.పెస్ క్యాపెచర్ తీసుకొకపోతే అటువంటి లబిద్దారులకు పథకాలు అందవన్నారు. గర్బిణీలు, గర్బవతులకు పోషకాహారం తీసుకొంటున్నారా లేదానిని గమనించాల్సి ఉందన్నారు. వేసవి కాలంలో చిన్న పిల్లలను జాగ్రత్తగా వారి వారి ఇళ్ల వద్దకు చేర్పాంచాలన్నారు. పరిసరాలను పరిశభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఆమె వెంట సీడిపిఒ మునికుమారి,సూపర్‌వైజర్లు పద్మ,బుజ్జమ్మలు ఉన్నారు.

## రసాభాసగా జరిగిన జనసేన పార్టీ సమావేశం



వెంకటగిరి, మే 20 ప్రభాతవార్త : పట్టణంలోని పింజల వీరయ్య కళ్యాణ మండపంలో జరిగిన జనసేన పార్టీ మీటింగ్ రసాబసగా ముగిసింది. జనసేన పార్టీ కార్యకర్తల నాయకులకు పార్టీ పంపిన కిట్లను పంపిణీ చేసేందుకు కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు ఘర్షణకు దిగారు. ఒకరినొకరు చూసుకున్నారు. సీనియర్ జనసేన పార్టీ నాయకుడు జంపాల ప్రకాష్ సర్ది చెప్పిన వారు వినలేదు. అరగంట తర్వాత ఘర్షణ సద్దుమనగడంతో కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తోట కృష్ణయ్య, రాధమ్మ, ఆర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ధర్నా



వెంకటగిరి, మే 20 ప్రభాతవార్త : సిఐటియు ఆధ్వర్యంలో వెంకటగిరి తాసిల్దార్ కార్యాలయం వద్ద లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయు తిరుపతి జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చేటటువంటి లేబర్ కోడ్స్ ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని అన్ని రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక సంఘాలు స్వతంత్ర సంఘాలు కలిసి మే20 జాతీయ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. దేశంలో ఉగ్రవాద దాడి అనంతరం పాకిస్తాన్తో యుద్ధం ఉద్రిక్త పరిస్థితుల కారణంగా జూలై 9వ తేదీన జాతీయ సార్వత్రిక సమ్మె జరపాలని కార్మిక సంఘాలు నిర్ణయం చేయడం జరిగిందని అన్నారు. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అన్నారు. శ్రమజీవులు,కష్టజీవులు, కార్మిక వర్గం దర్భర జీవితాలు అనుభవిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలను ఈ ప్రభుత్వం వేగవంతం చేసిందని అన్నారు. ట్రేడ్ యూనియన్ చట్టం 1926 ప్రకారం సంఘం పెట్టుకునే హక్కు ఉందని అన్నారు. సమ్మెలో పాల్గొని ప్రభుత్వం పై ఒత్తిడి పెంచాలని అన్నారు. లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు పోరాటాన్ని కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రమణయ్య, రాజయ్య, చిరంజీవి, వెంకట సుబ్బయ్య, సుబ్బరత్నమ్మ, కిష్టమ్మ, రత్నమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి చైర్మన్‌ని కలిసిన తెలుగు యువత



బాలాయపల్లి, మే 20 ప్రభాతవార్త : నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గెరిటి చెంచయ్య యాదవ్ నెల్లూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మెట్టుకురి ధనంజయ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అంతేకాకుండా, పెంచలకోన దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గా నియమి తులైన చెన్ను తిరుపాల్‌రెడ్డిని కూడా గౌరవ పూర్వకంగా కలసి, పేరుబోయిన విజయ్ శాలువా కప్పి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. గెరిటి చెంచయ్య యాదవ్ మాట్లాడుతూ సామాజిక సేవాభావంతో పాటు అనుభవం కలిగిన మెట్టుకురు ధనంజయ రెడ్డి లాంటి నాయకులు ఇలాంటి బాధ్యతలు చేపడితే, ప్రజలకు మరింత న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

## 22న మినీ మహానాడు

వెంకటగిరి, మే 20 ప్రభాతవార్త : ఈనెల 22వ తేదీ పట్టణంలోని పింజెలు వీరయ్య కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో మినీ మహానాడు కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు, యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నరసింహ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నట్లు చెప్పారు.

## రైతు,కౌలు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



గూడూరు, మే 20 ప్రభాతవార్త : మంగళవారం జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఆగిపోయిన రైతు, కౌలు రైతుల సమస్యలును, వెంటనే పరిష్కరించాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచి పోతున్నా ఇంతవరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు, అధికారులు పేపరు ప్రకటనలకే పరిమితమయ్యారని, రైతులు పట్ల, కౌలు రైతులు పట్ల ఏ సమస్యలు ఇంతవరకు పరిష్కారానికి నోచుకోలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గూడూరు నియోజకవర్గంలో రైతులు కౌలు రైతులకు సంబంధించిన పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలన్నారు. 45 సంవత్సరాలు నిండిన ప్రతి రైతు కౌలు రైతులకు ప్రభుత్వం ద్వారా వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని పై సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఏ.ఓ ఏ.శిరీషకి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, గూడూరు సి.ఐ.టి.యు నాయకులు బి.వి.రమణయ్య, పుట్టా శంకరయ్య, ఏ.చంద్ర మోహన్, బి.చంద్రయ్య, గుర్రం రమణయ్య, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలు కల్పించడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



గూడూరు, మే 20 ప్రభాతవార్త : నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఏపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డిఆర్‌డబ్ల్యూ, లక్ష ఫౌండేషన్ సహకారంతో మంగళవారం జాబ్‌మేళా ఏర్పాటు చేసారు. ఈ జాబ్ మేళాకు 22 కంపెనీల ప్రతినిధులు హాజరైయ్యారు. 500 మంది వరకు నిరుద్యోగులు హాజరై సద్వినియోగం చేసుకున్నారు. ఈ మేళాకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హాజరై ఆయన చేతులు మీదుగా పలువురు నిరుద్యోగులకు నియామక పత్రాలు అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటికే మూడు సార్లు జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగాల్లో చేరిన నిరుద్యోగుల్లో చాలా మంది మానేస్తున్నారన్నారు. ఉద్యోగాల్లో కొనసాగాలని సూచించారు. మంత్రి నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పినట్లుగానే నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, లక్ష్య ఫౌండేషన్ నిర్వాహకులు భాను చంద్రా రెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి లోకనాథం, ప్రిన్సిపాల్ హనుమంత రావు, విద్యాసాగర్, నాయకులు రహీమ్, సోమిశెట్టి చెంచు రామయ్య, మునిగిరీష్, గుండాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు అందక వెతలు

### - ప్రకృతి వ్యవసాయం ఉద్యోగుల ఎదురుచూపులు

కోట, మే 20 ప్రభాతవార్త : ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న శిక్షకులకు సక్రమంగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరందరూ ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) ప్రకృతి వ్యవసాయ శాఖ పరిధిలో పనిచేస్తున్నారు. లీడ్ ఫార్మర్ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ల విభాగంలో పనిచేస్తున్న వారికి స్థాయిని బట్టి రూ.7,500, రూ.10,500, రూ.12,500, రూ.15,500, రూ.17,500, రూ.22,500, రూ.25 వేలు, 27,500.. ఇలా జీతాలు అందజేస్తుంటారు. గత వైసీపీ సర్కార్ 2023 నుంచి వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. తిరుపతి జిల్లాలో సుమారు 360 మంది సేవలు అందిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా డిపిఎం షణ్ముగంను 'ప్రభాతవార్త' వివరణ కోరగా, ఈ నెలాఖరులోగా ఆరు నెలల బకాయిలు జమ చేస్తామని చెప్పారు.

## పాఠశాలలు తెరిచే నాటికే పిల్లలకు పండగే

కోట, మే 20 ప్రభాతవార్త : పాఠశాలలు తెరిచే సమయానికి పాఠ్య పుస్తకాలతో సహా బ్యాగు, దుస్తులు, షూ, బెల్టులతో కూడిన కిట్లు విద్యార్థులు అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేసే దిశగా అడుగులు వేస్తోంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా అందించాల్సిన కిట్లు వివరాలు ప్రభుత్వానికి నివేదించారు. ఈ నెలాఖరులోగా మండలాలకు కిట్లు రానున్నాయి. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పేరుతో కిట్లను పాఠశాలలు తెరిచే నాటికి అందజేస్తామని ఎంఇఒ మస్తానయ్య చెప్పారు.

# గూడూరు డివిజన్

## పంచాయతీల ప్రక్షాళన

కోట, మే 20 ప్రభాతవార్త : మెరుగైన పాలన సేవలు అందించేందుకు వీలుగా గ్రామ పంచాయతీ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ప్రస్తుతం ఆదాయం, జనాభా ప్రాతిపదికన ఐదు రకాల గ్రేడ్లుగా పంచాయతీలు కొనసాగుతున్నాయి. తాజాగా వీటిని ప్రత్యేక గ్రేడ్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3గా కుదించనున్నారు. పదివేల జనాభా లేదా కోటికి పైగా వార్షిక ఆదాయం ఉన్న పంచాయతీలను ప్రత్యేక గ్రేడ్‌గా పరిగణించనున్నారు. ఇక్కడ కార్యదర్శుల స్థానంలో డిప్యూటీ ఎంపిడిఒ (ఇఒపిఆర్‌డి)లను నియమించనున్నారు. పాత విధానంలో గ్రామ కార్యదర్శుల బదిలీలు, ఉద్యోగ ఉన్నతుల సమయంలో చిక్కులు తలెత్తనున్నాయి. పైపెచ్చు కొన్నింటికి పూర్తిస్థాయిలో కార్యదర్శులు ఉండటం లేదు. నూతన విధానంలో ఈ లోటుపాట్లు సరిచేస్తారు. మరోవైపు తగిన ముందు చూపులేకుండా గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను హేతుబద్ధీకరించనున్నారు. అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని సర్దుబాటు చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## ఉపాధిహామితో గ్రామాలు అభివృద్ధి



నాయుడుపేట, మే 20 ప్రభాతవార్త: ఉపాధిహామి పథకంతో గ్రామాలను అన్నివిధాల అభివృద్ధి చేయడం జరుగుతుందని నాయుడుపేట ఎపిఒ భానుప్రియ తెలియజేశారు. నాయుడుపేట మండలంలో మేనకూరు, కూచివాడ పంచాయితీల్లో పీల్డ్‌అసిస్టింట్లు లేనందున ఆ పంచాయితీల్లో ఉపాధిహామి పనులు చేపట్టడం లేదన్నారు. మిగిలిన అన్ని పంచాయతీల్లో ఉపాధిహామి పనులు వేగవంతంగా చేపడుతు న్నామని ఆమె తెలియజేశారు. మండలంలో ఉపాధిహామి పనులకు 1500మంది కూలీలు హాజరౌతు న్నారన్నారు. ఈపథకం ద్వార గ్రామాల్లో చెవురువు, గుంటలు పూడికతీత పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాల్లో చెరువులు, గుంటలు పూడికతీయడం వల్లన వర్షాకాలంలో నీటిసామర్థ్యత పెంచుకొనే అవకాశం ఉండటంతో పంటలు సమృద్ధిగా పండేవకాశం ఉందన్నారు. ఉపాధిహామి పనులు చేపట్టే సమయంలో పీల్డ్‌అసిస్టింట్లు కూలీలకు సరైన కొలతలు ఇవ్వడంతో రోజువారికూలీ గిట్టుభాటు అయ్యే విధంగా సుమారు 300 రూపాయల వరకు రావడం జరిగిందన్నారు.వేసవికాలం కావడంతో ఉపాధి పనులు చేపట్టే ప్రాంతంలో కూలీలకు, తాగునీరు,మజ్జిగ,ప్రథమ చికిత్స అవసరమైన సామాగ్రి అందుభాటులో ఉంచడం జరుగుతుందని తెలియజేశారు. ఈపథకం ద్వార గ్రామాల్లో చెరువులు, గుంటలను అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆమె తెలియజేశారు.

## బాల్య వివాహాలతో చట్ట రీత్యా చర్యలు : సిడిపిఓ



వెంకటగిరి, మే 20 ప్రభాతవార్త : బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సిడిపివో శంషాద్ బేగం తెలిపారు. కిషోర్ బాలికల ఆరోగ్యంపై అంగన్వాడి కేంద్రాల్లో ప్రదర్శన నిర్వహించారు. ఆ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్వహించరాదని తెలిపారు. కిషోర్ బాలికలకు పౌష్టి కరమైన ఆహారం అవసరమా అని తెలిపారు. ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

## రాయితీపై పశువుల దాణా పంపిణీ



నాయుడుపేట, మే 20 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతులకు యాబైశాతం రాయితీతో పశువుల దాణా అందజేయడం జరుగుతుందని నాయుడుపేట పశుసంవర్ధకశాఖ ఎడి గోవర ్దన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మేనకూరు పశువైద్య శాల సబ్‌సెంటరులో ఆయా గ్రామాల పాడి ైతులకు మంగళవారం ఆయన చేతుల మీదుగా పశువుల దాణా పంపిణీ చేశారు. ఈసందర్బంగా పశుసంవర్ధకశాఖ ఎడి గోవర్ధన్‌రెడ్డి మాట్లడుతూ ప్రభుత్వం పాడిరైతులను ఆదుకోవాలన ఉద్దేశంతో యాబైశాతం రాయితీపై పశువుల దాణా అందించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పేర ంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్,మిడత సూరిబాబు,పంచాయతీ కార్యదర్శి అశోక్, పశువైద్య అధికారులు,సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బోయకొండలో గంగజాతర



బంగారుపాళ్యం, మే 20 ప్రభాతవార్త: మండలంలోని వజ్రాలపుర బోయకొండపై వెలసిన గంగమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు సోమవారం సాయంత్రం నుండి ప్రారంభం కాగా మంగళవారం ఉదయం గంగమ్మకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ ఉత్సవానికి ఉభయ దారులుగా ఆలయ ధర్మకర్త రాధమ్మ, కృష్ణప్పలు వ్యవహరించారు. ఉదయం అభిషేక పూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ఆర్కెస్ట్రా వినోద కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామస్తులు అధిక సంఖ్యలో గంగమ్మను దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు.

## గంగమ్మకు గణనాధుని పట్టువస్త్రసాల బహూకరణ



కాణిపాకం, మే 20 ప్రభాతవార్త: బంగారు పాళ్యం మండలం అరగొండ- బంగారు పాళ్యం రహదారిలోని వజ్రాలపురం బోయ కొండ గంగమ్మ దేవస్థానంలో జరుగుతున్న అమ్మవారి జాతర ఉత్సవాలను పురస్కరిం చుకుని కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి దేవస్థానం తరపున మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఈమేరకు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్, ఆలయ అధికారులు, అర్చకులు వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయంకు చేరుకుని అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. పట్టువస్త్రాలను సమర్పించేందుకు బోయకొండ గంగమ్మ దేవస్థానంకు చేరుకున్న వారికి ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వీరు మంగళవాయిద్యాల నడుమ పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువెళ్ళి ఆలయంలో అందజేశారు. వీటిని అమ్మ వారికి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాణిపాకం ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు,సూపరెండెంట్ కోదండపాణి,అర్చకులు, వేదపండితులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మకు రంగస్థలి మరుపొంగళ్ళు



తిరుపతి(రవాణ)మే 20ప్రభాతవార్త: తాతయ్యగుంటగంగమ్మజాతర వేడుకలు ముగిసిన తరువాత తొలిమంగళవారం రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి కళాకారులు మరుపొంగళ్ల పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతిని చల్లగా చూడాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కల్పించాలని వేడుకున్నారు. వివిధ వేషధారణలతో కళాకారులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కెఎన్ రాజా, కేశవరెడ్డి, చంద్రబాబునాయుడు, రాజశేఖర్‌రెడ్డి, గుణశేఖర్, జయమ్మ, సాయినవీన, చంగల్‌రాయులు, రవిప్రసాద్, గంగయ్య, కోదండపాణి, పార్వతి, ధనలక్ష్మి తదితరులు ఊరేగింపుకు ఆలయంకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక్కడ భక్తులకు రాయలసీమ రంగస్థలి కళాకారులు అన్నదానం చేశారు.

## ఎన్‌టిఆర్ నగర్‌లో గంగమ్మ జాతర: నాయకుల సందడి



శ్రీకాళహస్తి,మే 20 ప్రభాతవార్త : పట్టణంలోని ఎన్‌టిఆర్‌న గర్‌లో మంగళవారం గంగమ్మ జాతరను అంగరంగవైభవంగా కన్నుల పండు వగా నిర్వహించారు.వేసవి కాలం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర తరువాత పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంగమ్మజాతరలను నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఎన్‌టిఆర్ నగర్‌లో జాతరను ఏర్పాటు చేసారు. ఇక్కడ గంగమ్మ కమిటిలో పాటు ఎన్‌టిఆర్ నగర్ యూనిట్ ఇంచార్జి నెమళ్ళూరు బుజ్జి ఆహ్వానం మేరకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి,బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్‌లు అమ్మవారి దర్శనానికి హాజరయ్యారు. ఎంఎల్ఏకు గంగమ్మ కమిటి సారధ్యంలో ఘనస్వాగతం పలికారు.ఈ సందర్బంగా యువకులకు ఎంఎల్ఏ సందేశమిస్తూ జాతరలు,ఉత్సవాలు, పండగలు మన సంస్కృతికి సంప్రదాయాలను భావి తరాలకు తెలియజేయటానికి ఎంతో ఉపయోగపడ తాయన్నారు. ఈ సంబరాలు స్నేహ వాతావరణంలో అందరితో కలసి మెలసి జరుపుకోవాలన్నారు.అమ్మవారి దివెనలతో తాను అత్యధిక మెజారిటితో విజయం సాధించానని ఎవరికి ఏ కష్టం వచ్చినా,నష్టం వాటిల్లినా ఆదుకోవటానికి మీ బిడ్డలా నేనున్నానని మరచిపోవద్దని సుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు.ఆయనతో పాటు రాష్ట్రబిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గాలి చలపతి నాయుడు, తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు,మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి నాగమల్లి దుర్గా ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, వినయ్,సుధాకర్‌రెడ్డి, పూల సురేష్, రాజా, శివకుమార్, అనూష, సునీత, నాగమ్మ, తేజ,బాబు, మునికుమార్, శేషు,వెంకటేశ్, కాలేషా, గోపి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## 25న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ : కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, మే 20 ప్రభాతవార్త : ఈనెల మే 25న జరగనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్-2025 సంబంధించిన పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు డీఆర్వో నరసింహులు,సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో 13 సెంటర్లల్లో పరీక్షలు జరగనున్నాయని, 5261 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు 144 సెక్షన్ పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి అడిషనల్ ఎస్పీ, తిరుపతి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్, డీఎంఅండ్ హెచ్‌వో, డ్వామా పీడీ, అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కల్యాణకట్టకు శ్రీవారి సేవకులు రెడీ...!

### - మహిళలకు కూడా అవకాశం కల్పించండి

### - ఏపీ నాయిబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నేత ఆవులపాటి బుజ్జిబాబుకు విజ్ఞప్తి



తిరుపతి కలెక్టరేట్, మే 20 ప్రభాతవార్త : టీటీడీ కల్యాణ కట్టకు శ్రీవారి సేవకులు రెడీ అవుతున్నారు .ఇప్పటికే ఏపీ నాయిబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవుల పాటి బుజ్జిబాబు, నగర అధ్యక్షులు సిబ్యాల సుధాకర్ సారధ్యంలో దాదాపు 200 మంది వరకు కల్యాణకట్టలో ఉచితంగా శ్రీవారి సేవకులు పనిచేయడానికి సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ సీఎం నారా చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్, మంత్రి నారా లోకేష్,తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు టీటీడీలో నాయిబ్రాహ్మణులకు కల్యాణ కట్టలో శ్రీవారి సేవకులను నియమించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా తిరుచానూరులోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం అసోసియేషన్ నేతలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవుల పాటి బుజ్జిబాబు, సిబ్యాల సుధాకర్,ముఖ్య అతిథిగా హాజరైన ఆర్టీసీ యూనియన్ నేత ఆవుల ప్రభాకర్ మాట్లాడుతూ ఐక్యమత్యంతో కలిసి కట్టుగా కల్యాణ కట్టలో నాయిబ్రాహ్మణ వృత్తికి న్యాయం చేయాలన్నారు. మొదటగా 200 మందిలో 150 మంది పురుషులు శ్రీవారి భక్తుల తలనీలాలు తీయనున్నారని, మహిళలు కూడా మరో 50 మంది తమకు అవకాశం కల్పించాలని అసోసియేషన్ నేతలకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ యాజమాన్యంతో చర్చించి న్యాయం చేస్తామని అసోసియేషన్ నేతలు మహిళలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూసేకరణ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

తిరుపతి కలెక్టరేట్, మే 20 ప్రభాతవార్త : జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక బద్ధంగా వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్టు పనులు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు,చెన్నై నేషనల్ హేవే పీడీలు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సూళ్ళూరు పేట, శ్రీకాళహస్తి ఆర్డీవోలకు కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి సంబంధిత మండలాల తహశీల్దార్లు తదితర సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఏడీబీ రోడ్లు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్‌రెడ్డి, డెప్యూటీ తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, మే 20 ప్రభాతవార్త : నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోన, రాజీవ్ గాంధీ కాలని తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య పనులను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీవకోన వంటి ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అలాగే అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా చేయాలని, ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. డ్రైయినేజీ కాలువలు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. చెత్త తొలగించడం, కాలువలు శుభ్రం చేయడం వంటివి ప్రణాళికాబద్దంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి రవి, తదితరులు ఉన్నారు.

## తిరుపతిజిల్లాకు సుపరిచితులే!

### టిటిడి నూతన సివిఎస్ఓగా కెవి మురళీకృష్ణ



తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి నూతన ముఖ్యనిఘాభద్రత అధికారిగా కెవి మురళీకృష్ణ నియమితులయ్యారు. ఆయన తిరుపతి జిల్లాకు సుపరచిత అధికారే కావడం, అటు టిటిడి భద్రతపై, ఇటు శాంతిభద్రతల పరిరక్షణపై పూర్తిస్థాయిలో అవగాహన,అనుభవం ఉండటంతో ప్రభుత్వం ఆయన్ను మంగళవారం నియమించింది. గతంలో ఆయన తిరుపతి ఈస్టు డిఎస్పీగా పనిచేశారు. అదనపు ఎస్పీగా పనిచేస్తూ ఎస్పీగా పదోన్నతి పొందారు. అనంతపురం జిల్లాలో, ఆ తరువాత అనకాపల్లిజిల్లా ఎస్పీగా సుదీర్ఘకాలం సమర్థవంతంగా పనిచేశారు. గతంలోనే ఎస్పీల బదిలీల్లో ఎన్నికల అనంతరం ఆయన తిరుపతి జిల్లాకు నియమితులు కావలసి వున్నా ప్రభుత్వం అనకాపల్లిలో నియమించింది. ప్రస్తుతం మురళీకృష్ణ విశాఖపట్నం 16వ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్నారు.తాజా ప్రభుత్వం ఆయన్ను టిటిడి సివిఎస్ఓగా నియమించింది. ప్రస్తుత పరిస్థితుల్లో భక్తుల భద్రత, ఆలయం రక్షణపై పూర్తిస్థాయిలో పట్టుసాధించనున్నారు. ఇప్పుడు తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సివిఎస్ఓగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నారు.

## ఉరుముల మెరుపుల వాన



శ్రీకాళహస్తి,మే 20 ప్రభాతవార్త : పుణ్యక్షేత్రం మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో తల్లడిల్లిన జనం సాయంత్రం 7 గంటల నుంచి హఠాత్తుగా కురిసిన వర్షంతో హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నారు.ఉదయం నుంచి ఎండ వేడికి వడగాల్పులతో ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం ప్రారంభం అయిన వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గింది.ఇక ఓ ఉరుము జనాల్ని భయభ్రాంతుల్ని చేసింది. ధమ ధమా అంటూ ఉరమటంతో ఎక్కడ పిడుగు పడిందో అని జనం ఉలిక్కి పడ్డారు. అయితే ముందస్తు ఖరీఫ్‌కు సిద్దమౌతున్న రైతన్నలకు ఈ వర్షాలు కొంత ఉపశమనం కల్గింది. వర్షంతో నాలుగు మాడావీధులు జలమయమయ్యాయి. మున్సిపల్ కాలువల్లోని దుర్గంధం కొట్టుకుపోయింది. అయితే సినిమా వీధిలోని ఓ మార్టు వద్ద పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

**CHANGE OF NAME**

I. **R.V.CHENCHAIAH** (Old Name), S/o R.Venkama Naidu, R/at DNo.1-47, Mannavaram Village, Srikalahasti Mandal, Tirupati Dist. A.P. I have changed my name to **CHENCHIAH RANGINENI S/oR.Venkama Naidu,** Henceforth I will be known as **CHENCHAIAH RANGINENI** (New Name).